# పున్నమి చంద్రుడు..

**న్యూస్‌టుడే- విజయవాడ**

గర్జన సదస్సుకు జనం పెద్ద సంఖ్యలో తరలిరావడంతో చంద్రబాబు తన ప్రసంగంలో పలు సందర్భాల్లో సతోషం వ్యక్తం చేశారు. సభ జరుగుతుండగా గుంటూరు మార్గంలోను, ఏలూరు మార్గంలోను ఇంకా వాహనాలు నిలిచిపోయి ఉన్నాయన్న సమాచారం ఆయనకు అందింది. సభాస్థలికి రావడానికి విజయవాడ వీధుల్లో కూడా జనంతో ట్రాఫిక్ స్తంభించిపోయినట్లు నాయకులకు తెలిసింది. ఇదంతా తెలుసుకున్న చంద్రబాబు ముఖం చంద్రబింబంలా వెలిగిపోయింది. బుచ్చయ్య చౌదరి మధ్యలో మైకులో ఒక ప్రకటన కూడా చేశారు. వందల కొద్దీ వాహనాలు విజయవాడ చేరలేక ఇంకా మార్గమధ్యంలోనే ఉన్నాయి..విజయవాడ రోడ్లపై ఇంకా జనం పెద్ద సంఖ్యలో ఆగిపోయారు. ఎక్కడ ఉన్న వారు అక్కడే టీవీలు చూసి ఈ కార్యక్రమానికి మద్దతు తెలపాలని వేదికపై ప్రకటించారు.

## గొంతు బొంగురుపోయిన బాబు

ప్రసంగం చివర్లో చంద్రబాబు గొంతు బొంగురుపోయింది. ఆయన చాలా ఉద్విగ్నంగా... ఆవేశంగా ప్రసంగించారు. చాలా సార్లు గొంతు సవరించుకోవాల్సి వచ్చింది. 'ఆఖరికి నా గొంతు కూడా బొంగురుపోయింది. నేను చాలా ఆవేశంగా ఉన్నాను. కాంగ్రెస్ చేస్తున్న అన్యాయాలపై కోపంగా ఉన్నాను. అందుకే ఆవేశంగా మాట్లాడేసరికి గొంతు బొంగురుపోతోంది' అంటూ చంద్రబాబు స్వయంగా చెప్పుకున్నారు. చివర్లో గొంతు పూర్తిగా సహకరించలేదు. అంతకుముందు బాబు మాట్లాడుతూ మద్దతు ధరలపై మనం గర్జించాలి కదా అని ప్రశ్నిస్తూ అందరూ ఇందుకు స్పందించాలని మైకులో సూచించారు. వెంటనే మైకులో పెద్ద పెద్ద శబ్దాలు వచ్చాయి. ఇదిగో ఆఖరికి మైకు కూడా మనకు మద్దతు చెబుతోందంటూ ఆయన ఉత్సాహంగా మాట్లాడారు. కొంత మైకు ఇబ్బంది పెట్టినా ఆయనలో ఏ మాత్రం చిరాకు రాకపోవడానికి సభాస్థలిలో జనం...వారి స్పందనే కారణమని స్పష్టంగా అర్థమైంది.

అంతకుముందు దేవేందర్ గౌడ్ మాట్లాడిన తీరుకు జనం పెద్ద ఎత్తున ఆమోదం పలికారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీరుతెన్నులపై ఆయన విరుచుకుపడుతోంటే సభలో పెద్ద ఎత్తున హర్షామోదాలు వ్యక్తమయ్యాయి. దేవేందర్‌గౌడ్ ప్రసంగించిన తీరు జనాన్ని కాదు.. చంద్రబాబును ఆకట్టుకుంది. ఆ తర్వాత హరికృష్ణ జనాన్ని ఉర్రూతలూగించారు. కాస్త తండ్రి ఎన్టీఆర్ శైలి కనిపించింది.

## ఎన్టీఆర్ నామస్మరణ

ఈ సభలో మొదటి నుంచి ఎన్టీఆర్‌కు ప్రాధాన్యం కనిపిస్తూ ఉన్నదే. కటౌట్లు, ప్రచారంలో ఆయనకు మంచి ప్రాధాన్యం ఇచ్చారు. ఈ సభలో జాతీయ స్థాయి నాయకులు అందరూ కూడా ఎన్టీఆర్ నామస్మరణ చేశారు. ఫరూక్ అబ్దుల్లా మరింత ముందడుగు వేశారు. ఎన్టీఆర్ కొడుకు హరికృష్ణను పిలిచి తన పక్కన నిలబెట్టుకుని కొద్దిసేపు... చంద్రబాబును కూడా పిలిచి పక్కనే నిలబెట్టుకుని, ఇద్దరి మధ్యలో నిలుచుని మరికొద్ది సేపు మాట్లాడారు... ఎదురుగా కనిపిస్తున్న పున్నమి చంద్రుణ్ని ఫరూక్ చూపిస్తూ చంద్రుడు ఉన్నంతకాలం ఎన్టీఆర్ కీర్తి నిలిచిపోతుందన్నారు. నేతల హిందీ ప్రసంగాలు తెలుగు శ్రోతలకు విసుగు కలిగించింది.